గోకులం నిర్మాణాలు వేగవంతం

● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న గోకులం నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం సీతంపేటలోని కుడ్డపల్లి, దేవనాపురం, వలగజ్జి గ్రామాల్లో గోకులం నిర్మాణాలను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించరాదని, నిర్దేశించిన గడువులోగా వాటిని పూర్తి చేయాలని సూచించారు. పలు ప్రాంతాల్లో వెంటనే గోకులాల నిర్మాణాలను ప్రారంభించాలన్నారు.

నిధులున్నా.. నిర్లక్ష్యమే!

● వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో పడకేసిన పర్యాటకం

● సీతంపేట ఏజెన్సీలో నిలిచిన జగతిపల్లి ప్రాజెక్టు

● కదలని వ్యూపాయింట్, రిసార్ట్స్ పనులు

● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



జగతిపల్లి వ్యూ పాయింట్ నుంచి కనువిందు చేస్తున్న ప్రకృతి అందాలు

సీతంపేట రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల్లో ఒకటైన జగతిపల్లి వ్యూపాయింట్, రిసార్ట్స్ అభివృద్ధి పనులకు మోక్షం లభించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాజెక్ట్‌కు బ్రేక్ పడింది. నిధులున్నా.. పనులు పూర్తికాని పరిస్థితి. ప్రస్తుతం అక్కడ నిర్మాణాల కోసం వినియోగించిన విలువైన ఐరన్ తుప్పువట్టి పాడవుతోంది. ఆ స్థలంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో పనులు జరిగిన ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. గత ఏడాది అప్పటి ఐటీడీఏ పీవో కల్పనకుమారి చొరవతో రూ.15 లక్షలు వెచ్చించి జగతిపల్లి వ్యూ పాయింట్‌ను నిర్మించారు. కానీ మిగిలిన పనులు చేపట్టకపోవడంతో జగతిపల్లి వ్యూ పాయింట్ అందాలను చూసేందుకు పర్యాటకులు ఎవరూ ముందుకు రావడం లేదు.



పనులు నిలిచిపోవడంతో తుప్పుపట్టి పాడవుతున్న ఇనుప చువ్వలు

దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం..

సీతంపేట ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ మేరకు జగతిపల్లి వ్యూపాయింట్, రిసార్ట్స్ పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇటీవల ఐటీడీఏ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లినట్లు సమాచారం.

● పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వం రూ.2.5 కోట్లు కేటాయించినట్లు ప్రకటించింది. వాటిలో రూ.1.5 కోట్లతో ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో మరికొన్ని సాహస క్రీడలను ఏర్పాటు చేయనున్నారు. మరో రూ.కోటితో అసంపూర్తి గా నిలిచిపోయిన గిరిజన మ్యూజియం పనులు చేపట్టనున్నారు. తురా యిపువలస ఉద్యానవన నర్సరీలో ఏకో పార్క్‌తో పాటు పర్యాటకులు రాత్రి బస చేసేందుకు కాటేజీలు నిర్మించేందుకు ఐటీడీఏ అధికారులు ఇప్పటికే స్థల పరిశీలన చేపట్టారు.



నూతనంగా నిర్మించిన జగతిపల్లి వ్యూ పాయింట్

● పులిపుట్టి పంచాయతీ పరిధిలో కన్నెధార కొండను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సుమారు రూ.5 కోట్లతో కొండపై వ్యూ పాయింట్, ట్రెక్కింగ్, రహదారులు వంటి నిర్మాణాలు చేపట్టను న్నారు. కన్నెధార కొండ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి జరిగితే ఆదివాసీ యువతకు స్థానికంగానే ఉపాధి దొరుకుతుందని గిరిజన సంఘం నాయ కులు సవరతోట ముఖలింగం, సవర బాజన్న, పొట్టేసులు తదితరులు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

గత టీడీపీ ప్రభుత్వం హయాంలో జగతిపల్లి వ్యూ పాయింట్, రిసార్ట్స్, స్విమ్మింగ్ పూల్, గ్రీనరీ, పార్కింగ్ వంటి పనులకు రూ.27 కోట్లు కేటాయించారు. వాటిల్లో మొదటి విడతగా జగతిపల్లి పనులకు రూ.7కోట్లు మంజూరు చేశారు. ఆ నిధుల్లో రూ.49 లక్షలతో రిసార్ట్స్ నిర్మాణం చేపట్టారు. 2018లో నిర్మాణం ప్రారంభించినా.. గిరిశిఖర ప్రాంతం కావడంతో నిధులు ఉన్నప్పటికీ పనులు వేగవంతం కాలేదు. ఇంతలో ఎన్నికలు జరగడం, వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఈ ప్రాజెక్ట్ అలానే నిలిచిపోయింది. మరోవైపు సున్నపుగెడ్డ, బెన్నరాయి జలపాతాల అభివృద్ధికి అటవీశాఖ అభ్యంతరాలు ఉండడంతో వాటి పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జగతిపల్లి వ్యూ పాయింట్, రిసార్ట్స్‌పై ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డిని వివరణ కోరగా.. గతంలో వాటి అభివృద్ధికి మంజూరైన నిధులు ల్యాప్స్ అయ్యాయన్నారు. ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని.. నిధులు మంజూరైన వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపడతామని స్పష్టం చేశారు.

చేతుల పరిశుభ్రతపై విస్తృత ప్రచారం

● కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం/టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చేతుల పరిశుభ్రతకు సంబంధించి విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం స్వచ్ఛ పార్వతీపురం, మరుగుదొడ్ల దినం తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంగన్‌వాడీలు, పాఠశాలలపై దృష్టి సారించి.. చిన్నారులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. మహిళా శిశు సంక్షేమ, విద్యాశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆదేశించారు. చేతుల శుభ్రతపై వల్ల 70 శాతం వరకు వ్యాధులు దూరమవుతాయని తెలిపారు. మరుగుదొడ్ల దినం పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బహిరంగ మలవిసర్జనకు అడ్డుకట్ట వేయాలని, మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. స్వచ్ఛ సుందర పార్వతీపురానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. టెన్త్ ఉత్తీర్ణులైన యువతను ఎస్ఎస్‌పీ సమన్వయకర్తలుగా గ్రామాల్లో నియమించాలన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురానికి సంబంధించి గ్రామ పంచాయితీ స్థాయిలో కార్యాచరణ ప్రణాళికను డిసెంబరు-1 లోగా తయారు చేయాలని ఆదేశించారు. డీపీవో కొండలరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

జాతీయస్థాయి సదస్సుకు కలెక్టర్

పార్వతీపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో గురువారం నిర్వహించనున్న జాతీయ స్థాయి సదస్సుకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ హాజరు కానున్నారు. నవజాతి శిశు మరణాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు తదితర అంశాలను ఆయన ప్రస్తావించనున్నారు. గతంలో జిల్లాలో ఏటా 300 వరకు శిశు మరణాలు నమోదయ్యేవి. అయితే ఇటీవల వాటి సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం వందలోపే మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో ఇందు కోసం జిల్లాలో తీసుకున్న చర్యలను కలెక్టర్ ఆ సదస్సులో తెలియజేయనున్నారు. కాగా జాతీయ సదస్సుకు బీహార్, పంజాబ్ కలెక్టర్లు హాజరవుతుండగా.. మూడో వారిగా రాష్ట్రం తరపున మన్యం జిల్లా కలెక్టర్‌తో పాటు వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి వినోద్‌కుమార్ పాల్గొనడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సైబర్ నేరాల నియంత్రణకు సహకరించండి

● బ్యాంక్ అధికారులతో ఎస్పీ మాధవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల నియంత్రణకు బ్యాంకు అధికారులు సహకరించాలని ఎస్పీ ఎస్.వి. మాధవరెడ్డి కోరారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో పలు బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు అందించారు. చోరీల్లో కంటే సైబర్ నేరాల్లోనే ఎక్కువగా నగదు పోగొట్టుకున్న బాధితులు ఉన్నారని ఆయన తెలిపారు. 2023లో సైబర్ నేరాల కారణంగా బాధితులు రూ.1.15 కోట్లు పోగొట్టుకుంటే ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.21.85 కోట్లు కోల్పోయారని వెల్లడించారు. జిల్లాలో ప్రధానంగా నిరక్షరాసులు, గిరిజనులు సైబర్ మోసాలకు గురై మొత్తంగా పోగొట్టుకుంటున్నారని తెలిపారు. ఇటువంటి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. సరైన గుర్తింపు కార్డు ఉంటేనే ఖాతా తెరవాలన్నారు. నాన్ లోకల్ వ్యక్తులకు ఖాతా తెరిచే సందర్భాల్లో అనుమానం వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఎక్కువగా లావాదేవీలు జరిగే అనుమానాస్పద బ్యాంక్ అకౌంట్లపై నిఘా పెట్టాలన్నారు. ఫేక్ లోన్ యాప్‌లు, సామాజిక మాధ్యమాల్లో పంపే లింకులు, ఓటీపీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ మోసాల కేసుల్లో సమయం చాలా ముఖ్యమని చెప్పారు. సరైన సమయంలో బ్యాంక్ అధికారులు సమాచారం ఇస్తే మోసాలకు పాల్పడే వారిని అరెస్ట్ చేయవచ్చని స్పష్టం చేశారు. బ్యాంక్‌లు, ఏటీఎంల వద్ద సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డులు తప్పని సరిగా ఉండాలన్నారు. సైబర్ మోసాలకు పాల్పడిన బాధితులు 1930 నెంబర్‌కి సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ ఓ.దిలీప్ కిరణ్, ఏఎస్పీ అంకిత సురానా, డీఎస్పీ రాంబాబు , వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

పత్తిని ఇచ్చి మద్దతు ధర తీసుకోండి

● క్వింటాకు రూ.7,521 చెల్లించనున్న సీసీఐ

● రైతులకు మార్కెటింగ్ శాఖ ఏడీ సూచన



విజయనగరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తి రైతుల సౌకర్యార్థం రామభద్రపురంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిందని, రైతులు తాము పండించిన పత్తిని ఆ కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందవచ్చునని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకుడు పి.రవికిరణ్ సూచించారు. ఈ నెల 18న 'కలిసిరాని పత్తి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తపై కలెక్టర్ అంబేడ్కర్ ఆరాతీశారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏడీ రవికిరణ్ మాట్లాడుతూ, రైతులు పంటను దళారులకు విక్రయించి నష్టపోవద్దని కోరారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తమ నిబంధనల మేరకు క్వింటాకు రూ.7,521 మద్దతు ధరను చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. అయితే పత్తి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ముందు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. రైతులు ఆరబెట్టిన, శుద్ధి చేసిన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడం ద్వారా సీసీఏ ప్రకటించిన మద్దతు ధర పొందవచ్చునన్నారు. పత్తి కొనుగోలుకు సంబంధించి, మరిన్ని వివరాలు, సందేహాల కోసం ఫోన్ నంబర్లు 91823 61390, 91823 61373లలో సంప్రదించాలన్నారు.

ఐదు నైపుణ్యాలు.. విజయదీపికలు

● కచ్చితంగా పాటిస్తే విజయం మీదే

● మార్కులే గీటు రాయి కాదు

● సాఫ్ట్ స్కిల్స్‌కే ప్రాధాన్యత

● వ్యక్తిత్వ వికాసం కీలకం

6లో





'వల'స బతుకులు

● మారని మత్స్యకారుల జీవితాలు

● నిరంతరం ఆర్థిక కష్టాలు

● విసిగివేసారి ఇతర రాష్ట్రాలకు వలసబాట

● నేడు ప్రపంచ మత్స్యకార దినం

6లో

నిరసన హోరు

● కలెక్టరేట్, ఐటీడీఏల వద్ద ప్రజా సంఘాల ఆందోళన

8లో



బెలగాం: ఐటీడీఏ వద్ద దీక్ష చేపట్టిన ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

కార్డుదారుల కష్టాలకు చెక్

● మెరుగైన సేవలందించేందుకు చర్యలు

● రేషన్ డిపోల పెంపునకు ప్రతిపాదనలు

● డీలర్ల పోస్టుల భర్తీకి సన్నాహాలు

● కూటమి సర్కారు నిర్ణయంపై జిల్లావాసుల హర్షం

గరుగుబిల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ డిపోల సంఖ్య పెరగనుంది. డీలర్ల పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. కార్డుదారులకు మెరుగైన సేవలందించాలనే కూటమి ప్రభుత్వం ఆదేశాలతో జిల్లా యంత్రాంగం కదిలింది. డిపోల పెంపునకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే పట్టణ, పల్లె ప్రాంతాల్లో నూతన డిపోలను ఏర్పాటు చేయనున్నారు. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం నిత్యావసర సరుకులు అందించేందుకు జిల్లాలో 196 వాహనాలు (ఎండీయూ)ను కేటాయించింది. ఇంటింటికీ రేషన్ సరుకులు అందించనున్నట్లు ప్రకటించినా, దూర ప్రాంతాల్లోనే వాహనాలను నిలుపుదల చేయడం వల్ల కార్డు దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇకపై కార్డుదారులు ఈ కష్టాలు పడరాదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం నూతన చర్యలకు శ్రీకారం చుట్టింది.



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీ (ఫైల్)

ఇదీ పరిస్థితి..

● జిల్లాలో 578 రేషన్ డిపోల పరిధిలో 2.81 లక్షలకు పైగా కార్డుదారులున్నారు. వారికి ప్రతినెలా పౌర సరఫరాలశాఖ నుంచి నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అదనంగా 49 దుకాణాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో రేషన్ డిపోల సంఖ్య 627కు చేరనుంది. జిల్లా పరిధిలో నూతనంగా డిపోలు ఏర్పాటు చేస్తే ఒక దుకాణానికి రూ. 41,500 ఖర్చవుతుంది. అయితే నిత్యావసర సరుకుల పంపిణీలో జాప్యం ఉండరాదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోంది. దీనిపై ఇప్పటికే అధికారులు సర్వే చేపడుతున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి అభిప్రాయాలు సేకరిస్తున్నారు.

● గ్రామీణ ప్రాంతాల్లో ఒక డిపో పరిధిలో 400 నుంచి 450 కార్డులు, పట్టణ ప్రాంతాల్లో 500 నుంచి 550, కార్పొరేషన్ పరిధిలో 600 నుంచి 650, పంచాయతీ పరిధిలో కనీసం 400 కార్డులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. రేషన్‌కార్డులు అధికంగా ఉన్న దుకాణాలను విభజించనున్నారు. 800 కార్డులు కన్నా అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇదిలా ఉండగా దుకాణాల విభజనపై అభ్యంతరాలుంటే తెలియపర్చాలని ఇప్పటికే కొంతమంది రేషన్ డీలర్లకు అధికారులు నోటీసులు జారీ చేశారు.

● కార్డుదారులకు రాయితీపై అందిస్తున్న రేషన్ బియ్యం దళారుల చేతికి చేరుతుంది. గ్రామస్థాయిలో వారు బియ్యం మొత్తం సేకరించి.. రాత్రి సమయంలో ఒడిశా ప్రాంతానికి తరలిస్తున్నారు. ఈ తరలింపులో కొంతమంది డీలర్లు, ఎండీయూ వాహన డ్రైవర్ల హస్తం ఉందన్న ఆరోపణలున్నాయి. దీనిపై కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ఖాళీల భర్తీకి సన్నాహాలు

జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ డిపో డీలర్ల నియామకానికి చర్యలు చేపట్టనున్నారు. ప్రస్తుతం మన్యంలో 33 ఖాళీలు ఉండగా.. రోస్టర్ పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. డివిజన్ స్థాయి అధికారుల పర్యవేక్షణలో నియామకాలు జరగనున్నాయి.

ఎండీయూలతో ఇబ్బందులు

ఎండీయూ వాహనాల నిర్వహణలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆపరేటర్లు ఇంటింటికీ సరుకులు సరఫరా చేయలేకపోతున్నారు. డీలర్ల వ్యవస్థను బలోపేతం చేయాలి. పాత విధానమే అమలుపరిస్తే కార్డుదారులకు ఉపయుక్తంగా ఉంటుంది.

- డి.శ్రీనివాసరావు, డీలర్ల సంఘ అధ్యక్షుడు, పార్వతీపురం

డిపోల పెంపు, డీలర్ల భర్తీకి చర్యలు

జిల్లాలో రేషన్ కార్డుదారులకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం ఉన్న 578 డిపోలతో పాటు మరో 49 దుకాణాల కోసం ప్రతిపాదనలు పంపించాం. 33 చౌక ధరల దుకాణాలకు డీలర్ల నియామకానికి చర్యలు చేపడుతున్నాం. కొద్ది రోజుల్లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. డీలర్ల సమస్యలను ఉన్నతాధికారులకు తెలియపర్చాం. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టాం. ఎండీయూ వాహనాలపై ఎటువంటి సమాచారం రాలేదు.

- పి.శ్రీనివాసరావు, సివిల్ సప్లైస్, పార్వతీపురం మన్యం జిల్లా

విజయదీపికలు

ఐదు నైపుణ్యాలు..



● చీపురుపల్లికి చెందిన విశాల్ అనే యువకుడు ఓ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసించాడు. చదువులో బాగా రాణించి ఇంజనీరింగ్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాడు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగం గ్యారెంటీ అన్న నమ్మకంతో ఉండేవాడు. తన మిత్రులు కూడా పదే పదే అదే మాట అనేవారు. ఇటీవల జరిగిన ప్రాంగణ ఎంపికలకు సంబంధించి తుది జాబితాలో విశాల్ పేరు కనిపించలేదు.

● చీపురుపల్లికి చెందిన మరో ఇంజనీరింగ్ విద్యార్థి అనుదీప్ చదువుతో పాటు పాఠ్యేతర అంశాల్లో చాలా చురుగ్గా ఉండేవాడు. ఇతను ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యాడు. ఇంజనీరింగ్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు కూడా పొందలేని ఉద్యోగాన్ని ఒడిసి పట్టాడు. అతని విజయానికి కారణం సాఫ్ట్‌స్కిల్స్

● కచ్చితంగా పాటిస్తే విజయం మీదే ● మార్కులే గీటు రాయి కాదు
● సాఫ్ట్ స్కిల్స్‌కే ప్రాధాన్యత ● వ్యక్తిత్వ వికాసం కీలకం

చీపురుపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని చాలామంది విద్యార్థులు విశాల్ లాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు. చదువులో ముందున్నా, పరీక్షల్లో మార్కులు బాగా సాధించి మంచి ర్యాంకులు తెచ్చుకున్నా ఉద్యోగ సాధనలో మాత్రం విఫలమవుతున్నారు. విషయ పరిజ్ఞానం ఉన్నా, చేరాలనుకున్న లక్ష్యాలకు ఆమడ దూరంలో ఆగిపోతున్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు ముఖ్యంగా సాఫ్ట్ స్కిల్స్ ప్రాధాన్యాన్ని గుర్తించాలి. అపారమైన తెలివి తేటలు ఉన్నా సాఫ్ట్‌స్కిల్స్ లేకపోతే అవన్నీ నిరుపయోగమే. కాలంతో పాటు సాంకేతిక ప్రపంచంలో వస్తున్న మార్పులను స్వీకరించడాన్ని సాఫ్ట్‌స్కిల్స్‌గా పేర్కొంటున్నారు. బృంద సభ్యుడిగా రాణించడం, సంభాషణ, సమస్యలను సొంతంగా పరిష్కరించుకోగలడం, సమయపాలన, నాయకత్వ లక్షణాలు ఉంటే విజయానికి చిరునామాగా మారొచ్చు. విషయ పరిజ్ఞానం, విద్యలో ఉత్తమ ప్రతిభ కలిగి ఉన్నా, అనేక మంది ఉద్యోగాల సాధనలో వెనుకబడిపోతున్నారు. లెక్కలు, సైన్సులో ఎన్ని సూత్రాలు, ఈక్వేషన్లు తెలిసినా, అపారమైన తెలివితేటలు ఉన్నా అవి ఉపాధికి ఉపయోగపడడం లేదు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే సాఫ్ట్‌స్కిల్స్ ఉండాల్సిందే. ఉద్యోగార్థుల నుంచి ఇలాంటి నైపుణ్యాన్నే నియామక సంస్థలు ఆశిస్తున్నాయి. ఉద్యోగం పొంది అగ్రస్థానానికి చేరుకోవాలంటే ప్రధానంగా ఐదు నైపుణ్యాలు పెంచు కోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ పంచతంత్రంతో విజేతలు కావచ్చునని సలహా ఇస్తున్నారు. అవేంటో తెలుసుకుందాం.



బృంద సభ్యుడిగా..

బృందంలో పనిచేస్తే ఇతరుల నుంచి చాలా విషయాలు తెలుసుకోవచ్చు. జట్టుగా ప్రాజెక్టులు చేయాల్సి వచ్చినప్పుడు నేర్పు ముఖ్యం. మన తప్పులను సహచరులు తెలియజేస్తే వాటిని సరిచేసుకుని మరింత రాణించొచ్చు. సవాళ్లను స్వీకరించి సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి. ఎవరి సాయం లేకుండా చేయగలననే ధీమా పనికిరాదని వ్యక్తిత్వ వికాస నిపుణులు అంటున్నారు. ఉన్నత స్థానం చేరుకోవాలంటే పరస్పర సహకారం అవసరం. ఇది అలవాటవ్వాలంటే క్రీడలు, విద్యేతర అంశాల్లో ఎక్కువగా పాల్గొనాలి. కళాశాల స్థాయిలోనే ఈ నైపుణ్యాన్ని అలవర్చుకొని ముందుకు సాగాలి.

భావ వ్యక్తీకరణ..

భావ వ్యక్తీకరణ విషయంలో నవ్యాంధ్ర యువత వెనుకంజలో ఉందని ఇటీవల ఓ ప్రముఖ సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ప్రశ్నలు అడగడంలోనూ, ఉత్సాహంగా వినడంలోనూ ఎదుటి వారి కళ్లలోకి సూటిగా చూసి మాట్లాడే విషయంలో విఫలమై ఉద్యోగాలకు ఎంపిక కాని వారు ఎందరో ఉన్నారు. ఎలక్ట్రానిక్ విప్లవంతో ప్రపంచంలోని యువత ఒక వేదికపైకి వస్తోందనే అపోహ రాజ్యమేలుతోంది. వీటి వల్ల ముఖాముఖి పరిచయాలు, టెలిఫోన్ సంభాషణలు తగ్గిపోయాయి. దీంతో యువతలో వాక్చాతుర్యం తగ్గుతోంది. విద్యార్థులు, ప్రొఫెసర్లతో మంచి సంబంధాలు ఉంటే వారి నుంచి విలువైన సలహాలు, సూచనలు పొందవచ్చు. సంభాషణలు కొరవడడంతో ఉద్యోగాల్లో మెరుగైన ఫలితాలు సాధించలేక పోతున్నారని నిపుణుల అభిప్రాయం. దీన్ని అధిగమించా లంటే భయం లేకుండా మాట్లాడాలి. సందేహాలు వస్తే వాటిని తీర్చుకోవాలి. ఇంటర్న్‌షిప్‌కు వెళ్తే భావవ్యక్తీకరణ నైపుణ్యం పెంచుకోవచ్చు.

సమస్యలను ఎదుర్కోవడం..

విద్యార్థులకు అనేక సమస్యలు ఎదురవుతాయి. ఇతరుల సాయంతో వాటిని అధిగమించవచ్చునని అనుకోకూడదు. ఇతరుల సాయం లేకుండా వాటిని పరిష్కరించుకునే సామర్థ్యాన్ని సొంతంగా పెంపొందించుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోలేని వారు, ఇతర అంశాలు తెలుసుకోలేనివారు ఇబ్బందులు పడతారు. ప్రతికూల పరిస్థితులను సైతం నూతన విధానాల ద్వారా సొంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. తరచూ చర్చాగోష్ఠులు, సైన్స్ ఒలింపియాడ్‌లు, సదస్సుల్లో పాల్గొనాలి.

సమయ పాలన..

చిన్నప్పటి నుంచీ సమయపాలనను అలవర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. నియమిత వ్యవధిలో జరిగే పరీక్షల్లో దీని విలువ అనంతం. విద్య, ఉద్యోగ దశల్లో అధ్యాపకులు, ఉన్నతాధికారులు అప్పగించిన పనిని సకాలంలో పూర్తి చేయడానికి సమయమనేది కీలకం. దీన్ని సమర్థంగా వినియోగించుకోడానికి, ప్రాధాన్యత ప్రకారం పనుల్ని పూర్తి చేయడానికి సమయపాలన అవసరం. ఒక్కోసారి ఏక కాలంలో అనేక ప్రాజెక్టులు నిర్వహించాల్సి వస్తుంది. ఇది ఓర్పు, సమయపాలనతోనే సాధ్యం. పాఠశాల, కళాశాలల స్థాయి నుంచే వివిధ బాధ్యతలను తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. ఇంటర్న్‌షిప్, స్వచ్ఛంద సేవ, తదితర కార్యక్రమాల్లో పాల్గొనాలి. అప్పుడే పనుల ప్రాధాన్యత క్రమం, వాటి నిర్వహణలో సమర్థత, అనుభవం వస్తుంది.

నాయకత్వ లక్షణం..

సభ్యుడిగానే కాకుండా కొన్ని సార్లు నాయకుడిగా ఉండాల్సి రావచ్చు. దీన్ని వినియోగించుకోవడానికి సిద్ధంగా ఉండాలి. కళాశాలలు, పని చేసేచోట ఇలాంటి పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకే నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి. నియామక సంస్థలు ఎప్పుడూ నాయకత్వ పటిమ ఉన్న వారి కోసం వెతుకుతాయి. వీటి కోసం విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే ప్రయత్నించాలి. ఆటల్లో కెప్టెన్‌గా అవకాశం వస్తే వదులుకోకూడదు. విద్యార్థి సంఘాల కార్యక్రమాల్లో, పాఠ్యేతర అంశాల్లోనూ చురుగ్గా పాల్గొనాలి.

సోషల్ స్కిల్స్ లోపిస్తున్నాయి..

నేటి యువతలో సోషల్ స్కిల్స్ లోపిస్తున్నాయి. వాటిని సంపాదించుకోవాలి. ఉన్నతి స్వచ్ఛంద సంస్థ యువతకు కావాల్సిన ఇతర నైపుణ్యాలను అందిస్తోంది. పలు విద్యాసంస్థల ద్వారా ఇవి అందుతున్నాయి. ఆ సంస్థ సహకారంతో మా కళాశాలలో కూడా ప్రతి యేడాది సుమారు 30 మందికి అదనపు పరిజ్ఞానాన్ని అందిస్తున్నాం. విద్యార్థులు సాధారణ నైపుణ్యాలను పెంపొందించుకొని, ఈ ఐదు లక్షణాలను అభివృద్ధి చేసుకుంటే ఉద్యోగ సాధన సులభతరమవుతుంది.

-కృష్ణాజీ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల, చీపురుపల్లి

శాసనసభలో మన ఎమ్మెల్యేల గళం

రాయితీపై పశువుల దాణా ఇవ్వాలి

● ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



రాజాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పశువుల దాణాను రాయితీపై అందజేస్తే రాజాం నియోజకవర్గంలో పాడి పరిశ్రమ బాగా అభివృద్ధి చెందుతుందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. పాడి పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. నియోజకవర్గంలో 10 పశువుల ఆసుపత్రులు ఉంటే ఎనిమిది మంది మాత్రమే వైద్యులు ఉన్నారని, వైద్యుల కొరత లేకుండా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గంలో 40వేలకు పైబడి పశువులు ఉన్నా 20వేల లీటర్ల పాలు వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. దీనికి కారణం దాణాను పూర్తిస్థాయిలో అందించలేకపోవడమేనని అభిప్రాయపడ్డారు. దాణా కిలో ఖరీదు రూ.50నుంచి రూ.60 ఉందని, ప్రభుత్వం దృష్టిసారించి రాయితీపై అందజేయాలన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ఉన్న సమయంలో కేజీ దాణా రూ.13 ఉండేదని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పశువులు దాణా ధరను విపరీతంగా పెంచడంతో పాడిరైతులు దాణా కొనలేకపోయారన్నారు. గత ప్రభుత్వం పాడిరైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాయితీపై పశువుల షెడ్లు, దాణా ఇవ్వాలన్నారు. పశువులు, గొర్రెల పెంపకంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు.

సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా మార్చండి

● ఎమ్మెల్యే బేబీనాయన



బొబ్బిలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అసెంబ్లీలో బుధవారం ప్రస్తావించారు. బొబ్బిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను (సీహెచ్‌సీ)ని వంద పడకల ఆసుపత్రిగా మార్పు చేయాలని కోరారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నాయని, అయితే బెడ్స్ సమస్య వల్ల చాలామంది ఆసుపత్రికి వచ్చి వెనుదిరుగుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. బాడంగి సీహెచ్‌సీ భవన నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు సహకరించాలని, బాడంగి మండలం గొల్లాది గ్రామ సమీపాన వేగావతి నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వంతెన మంజూరు చేశారని, వైసీపీ పనులు ప్రారంభించలేదని గుర్తు చేశారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న వంతెనను తిరిగి మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేయాలని బేబీనాయన ప్రభుత్వాన్ని కోరారు. వంతెన నిర్మిస్తే గజపతినగరం నియోజకవర్గ పరిధిలోని దత్తిరాజేరు, చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలోని మెరకముడిదాం, బొబ్బిలి, పార్వతీపురం మన్యం జిల్లాల ప్రజలకు రవాణా, ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే బేబీనాయన అసెంబ్లీలో వివరించారు.

ఆసుపత్రుల భవనాలు నిర్మించాలి

● ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



లక్కవరపుకోట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని, వాటికి నిధులు కేటాయించాలని బుధవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అసెంబ్లీలో ప్రస్తావించారు. ఎస్.కోట ఏరియా ఆసుపత్రితోపాటుగా ఎల్.కోట,కొత్తవలస, వియ్యంపేట, జామి, అలమండ పీహెచ్‌సీ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయని, గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. కొన్నిచోట్ల అద్దె భవనాల్లో ఓపీలు చూస్తున్నారని, కూటమి ప్రభుత్వం పీహెచ్‌సీ భవనాలకు నిధులు కేటాయించి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించాలని కోరారు.

సాగునీటి సమస్య పరిష్కరించండి

● ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



గుమ్మలక్ష్మీపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమ నియోజకవర్గంలో సాగునీటి సమస్యను పరిష్కరించాలని కురుపాం ఎమ్మెల్యే, విప్ తోయక జగదీశ్వరి బుధవారం అసెంబ్లీ సమావేశంలో కోరారు. తోటపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పునరుద్ధరించాలన్నారు. గుమ్మడిగెడ్డ, వట్టిగెడ్డ జలాలను అనుసంధానం చేయాలని, జంఝావతి ప్రాజెక్టు విషయమై ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడి క్లియరెన్స్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

వలస బతుకులు

నేడు ప్రపంచ మత్స్యకార దినం

● నాటు పడవలతోనే చేపలవేట..
● ధరలు గిట్టుబాటు కాక ఇతర ప్రాంతాలకు..
● ఇంటికి క్షేమంగా వస్తారో రారో తెలియని పరిస్థితి



ఎన్నేళ్లయినా.. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా మత్స్యకారుల బతుకులు మాత్రం మారడంలేదు. సంద్రంలోకి వేటకెళ్తే క్షేమంగా తిరిగొస్తారో రారో తెలీని పరిస్థితి. కుటుంబ సభ్యులు గుండెలు అరచేతిలో పెట్టుకుని ఎదురు చూడాల్సిన పరిస్థితి. నడి సంద్రంలో బోట్లు బోల్తా పడితే మృత్యువే గతి. ఇలా వారి జీవితాలు దినదినగండంగా గడుస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం వీరి కోసం ఎన్నెన్నో చేస్తామని హామీలు ఇచ్చింది. చేపల విక్రయానికి మార్కెట్ యార్డు, శీతల గోదాము నిర్మిస్తామని గొప్పలు చెప్పి అటకెక్కించింది. అలాగే జెట్టీ నిర్మిస్తామని చెప్పి విస్మరించింది. ఎన్నో కష్టాలు పడి వేట సాగించి తెచ్చిన చేపలకు కూడా సరైన ధరలేక పోవడంతో వారికి నష్టమే మిగులుతోంది.

భోగాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలో 28 కిలోమీటర్ల సముద్రతీరం విస్తరించి ఉంది. చింతపల్లి, తమ్మయ్యపాలెం, తిప్పలవలస, బర్రిపేట, కొత్తూరు, కోనాడ, నీలగెడ్డపేట, బర్రిపేట, కోత్తూరు, కోనాడ, బొడ్డుగురయ్యపేట, పులిగెడ్డ, ముక్కాం, చినకొండ్రాజుపాలెం, పెద కొండ్రాజు పాలెం, ఎర్రముసలయ్య పాలెం, చేపలకంచేరు మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 20వేల మంది ఉన్నారు. ఇందులో వేటపై ఆదారపడిన కుటుంబాలు 5వేలు ఉన్నాయి. అలాగే సాంప్రదాయ పడవలు 419, మరపడవలు 722 ఉన్నాయి.

ఆగస్టులోనే వలస

ఈ ఏడాది కూడా మత్స్యకారులు ఆగస్టులోనే గుజరాత్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలకు వలసపోయారు. గుజరాత్‌లో వీరావల్, కాండ్లా, పోరుబందర్‌తో పాటు కర్ణాటకలోని మంగుళూరుకు వెళ్తుంటారు. తిరిగి ఏప్రిల్ నెలలోనే స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. 8 నెలల పాటు కన్నవారిని, ఉన్న ఊరిని విడిచి ఇతర ప్రాంతాల్లోనే ఉంటున్నారు. తీరంలో చేపలు అనుకున్నంత లభ్యంకాక, కష్టానికి తగ్గ ఫలితంలేక, కనీస సౌకర్యాలులేక.. ఉపాధి కరువై పోవడంతో సుమారు 700 మంది ఆగస్టులోనే గుజరాత్, ఒడిశా, కర్ణాటక, విశాఖ తదితర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. దళారులు గ్రామాలకు వచ్చి అడ్వాన్సులు ఇచ్చి మత్స్యకారులను తీసుకెళ్లిపోయారు. వలస వెళ్లిన వారిలో అధికశాతం యువకులే. అలా వెళ్లిన వారు సముద్రంలో గల్లంతై మృతదేహాలు కూడా దొరకని పరిస్థితి. దీంతో వారి కుటుంబాలు దుర్భర జీవనం గడుపుతున్నాయి.

వలసలకు కారణాలివీ

జిల్లాలో 28 కి.మీ. సముద్ర తీరమున్నా గుజరాత్ రాష్ట్రానికి వలసపోవడానికి కారణం మత్స్యకారుల ఆర్థిక పరిస్థితులే. ఇక్కడివారు సంప్రదాయ తెప్పలు, మోటారు బోట్లతో వేట సాగిస్తున్నారు. ఐదారుగురు జాలర్లు వేటకు వెళితే ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉంది. ఇల్లు కట్టాలన్నా, ఆడపిల్లల పెళ్లిళ్లు చేయాలన్నా పెద్ద సమస్యగా మారింది. గుజరాత్‌లోని బోటు యజమానులతో ముందుగా ఒప్పందం కుదుర్చుకుని మత్స్యకారులు వలసవెళ్తారు. ఒక్కో బోటులో 7 నుంచి 9 మంది వరకు ఉంటారు. ఇందులో డ్రైవర్ (గుజరాత్‌లో తండేలు అంటారు), అసిస్టెంట్ డ్రైవర్, కలాసీలు, వంట మనిషి (బండారి) ఉంటారు. సీనియర్ డ్రైవర్‌కు నెలకు 35 వేల రూపాయలు, అసిస్టెంట్ డ్రైవర్‌కు 20 వేల వరకు, కలాసీ, వంట మనిషికి 12వేల నుంచి 15 వేల వంతున చెల్లిస్తారు. వేట ఆశించిన స్థాయిలో సాగితేనే డబ్బులు ఇస్తారు. గుజరాత్‌లో వలస మత్స్యకారులు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాలకు గురై మృత్యువాతన పడుతున్నారు.

సరిహద్దు దాటితే అంతే..

గుజరాత్‌లో వీరావల్‌లోని అరేబియా సముద్రంలో చేపల వేటసాగిస్తే ఈ ప్రాంత మత్స్యకారులు పొరపాటున సరిహద్దు దాటితే పాక్ కోస్ట్‌గార్డులకు చిక్కిన సందర్భాలు అనేకం ఉన్నాయి. 2018 సంవత్సరం నవంబరు నెలలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన 22 మంది మత్స్యకారులు పాక్‌కు బందీలుగా చిక్కి ఏడాదిన్నర తర్వాత విముక్తులయ్యారు. అంతకు మునుపు కూడా ఇలాంటి ఘటనలు ఉన్నాయి.


ఇక్కడ సౌకర్యాల్లేక..

మత్స్యకార గ్రామాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. చేపలు ఆరవేసుకోవడానికి ప్లాట్‌ఫారాలు, కమ్యూనిటీ భవనాలు లేవు. వలలు భద్రపర్చుకోవడానికి లేదు. ప్లాట్‌ఫాంలు నిర్మించాలని, కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని, గ్రామాల నుంచి సముద్రానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, కొనాడలో జెట్టీ నిర్మించాలని, మార్కెట్‌యార్డు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. వేట నిషేధ సమయంలో రూ.20వేలు అందజేయాలంటున్నారు.



ప్లాట్ ఫాం లేక నేలపై చేపలు ఆరబోసిన మత్స్యకారులు

వలలు, పడవలు రాయితీపై అందించాలి



గత ప్రభుత్వం మత్స్యకారులను ఏవిధంగానూ ఆదుకోలేదు. ఈప్రభుత్వం అయినా మాపై కరుణ చూపాలని ఆశిస్తున్నాము. మత్స్యకారులకు అవసరమైన పడవలు, వలలు, ఇంజన్ వేట సామగ్రి రాయితీపై అందించాలి. అలాగే చేపలకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు చేపట్టాలి.

- మైలపల్లిఎల్లయ్య, మత్స్యకారుడు

జెట్టీ నిర్మించి వలసలు ఆపాలి



ఇక్కడ సరైన సౌకర్యాల్లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లిపోతున్నారు. జెట్టీ నిర్మించాలి. అలాగే సామూహిక భవనాలు నిర్మించాలి. అప్పుడే వలసలు ఆగుతాయి. మా బతుకులు బాగుపడుతాయి.

- ఉమ్మడి రామారావు, ముక్కాం

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళాం



ఈ ప్రాంతంలో కొంతవరకు వలసలు వెళ్తున్నారు. జెట్టీ నిర్మాణానికి చర్యలు చేపడుతాం. అలాగే వలలు, పడవలు, ఇంజన్లు, రాయితీపై అడుగుతున్నారు. దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాం.

- ఎన్.నిర్మలాకుమారి, మత్స్యశాఖ డీడీ



ఈమె పేరు మైలపల్లి అప్పయ్య చేపలకంచేరు గ్రామం. ఊర్లో ఒంటరిగా ఉంటోంది. భర్త, కొడుకు, కోడులు, ఇద్దరు పిల్లలు. చక్కగా సాగే కుటుంబం. 12 ఏళ్ల క్రితం ఈమె భర్త ఎల్లయ్య మృతి చెందాడు. దీంతో అప్పటి నుంచి కుటుంబ భారమంతా పెద్ద కుమారుడు మైలపల్లి ఎల్లారావుపై పడింది. ఒక్కరు నలుగురిని పోషించాలి. ఇక్కడ సరైనపనులు లేవు. దీంతో వలసకు సిద్ధమయ్యాడు. ఓ వ్యక్తి గ్రామానికి వచ్చి రూ.10 వేలు అప్పయ్య చేతిలో పెట్టి ఎల్లారావును పారాదీప్‌నకు తీసుకెళ్లాడు. ఆతర్వాత ఆమె పిడుగులాంటి వార్త వినాల్సి వచ్చింది. ఎల్లారావు సముద్రంలో గల్లంతైనట్లు అక్కడి వారు చెప్పారు. ఇప్పటికి అతని ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆ కుటుంబం ఛిన్నాభిన్నమై పోయింది. 12 సంవత్సరాల నుంచి బాధ అనుభవిస్తున్నానని, తన కోడులు ఇద్దరు పిల్లలతో కలిసి విశాఖపట్నం వెళ్లి ఇళ్లలో పనిచేసుకుంటూ బతుకుతున్నారని మైలపల్లి అప్పయ్య ఆవేదన వ్యక్తం చేసింది. తాను ఇక్కడ చేపలు అమ్ముకుంటూ బతుకీడుస్తున్నానని, తమ కుటుంబ పరిస్థితి ఎవరికీ రాకూడదని ఆమె కోరుకుంటోంది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తోంది.

న్యూస్ బాక్స్

హుండీ ఆదాయం రూ.1.23 లక్షలు

రాజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం చేపట్టారు. నవదుర్గ, సంగాం ఆలయాల ఈవో శ్యామలరావు ఆధ్వర్యంలో ఈ లెక్కింపు కార్యక్రమం జరిగింది. 68 రోజులకు గాను రూ. లక్షా 23వేల 794 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వాకచర్ల చినరాజా, సిబ్బంది రాము. ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

గజపతినగరం, నవంబరు 20: (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి నిర్వహించే జాబ్‌మేళాకు హెటిరో, అస్పిరైటెక్నాలజీస్ తదితర బహుళజాతి కంపెనీలు హాజరుకానున్నట్లు తెలిపారు. 18నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు గల యువతీ యువకులు హాజరు కావాలని కోరారు. వివరాల కోసం 79898 26953, 99888 53335 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

లక్కవరపుకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎల్.కోట రూరల్ ఫీడర్‌లో ఉన్న గొల్జాం, కల్లెంపూడి, ఎల్‌కేఎస్.పురం, పాటూరు, బొద్దాం, కొత్తబొద్దాం, ఓబుల య్యపాలెం, ముకుందపురం గ్రామాలకు శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగు తుందని ఈఈ సురేష్‌బాబు తెలిపారు.

అశాస్త్రీయ విధానాలు వద్దు

వంగర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో అశాస్త్రీయ అసమంజసమైన విధానాలను ప్రభుత్వం కొనసాగించడం బాధాకరమని యూటీఎఫ్ నాయకులు మురళి, రమణ ఆవేదన వ్యక్తం చేశారు. అరసాడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాలని ఇచ్చిన ఉత్తర్వులు వెనుకకు తీసుకోవాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా సీర అప్పలనాయుడు, అధ్యక్షునిగా ప్రసాద్, కార్యదర్శిగా శంకర్, ఉపాధ్యక్షునిగా ప్రసాద్ ఎన్నికయ్యారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

సంతకవిటి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి పైల నవీన్ అన్నారు. మందరాడ రైతు భరోసా కేంద్రంలో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 18 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు.రైతులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు.

స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

గరివిడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోడూరులో నిర్మాణం పూర్తయిన సబ్ స్టేషన్‌లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అడపా సూర్యనారాయణ, యలకల వెంకునాయుడులు కోరారు. ఈమేరకు స్థానిక యువకులతో కలసి విద్యుత్ అధికారులకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్, సెక్యూరిటీ గార్డు, ఎలక్ట్రిషియన్ తదితర పోస్టులలో స్థానికులకు అవకాశం కల్పించాలని వారు కోరారు.

పాఠశాల సముదాయం

డెంకాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డెంకాడ మండలం అక్కివరం వద్ద ఆదర్శ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుల పాఠశాల సముదాయాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు సీహెచ్ సంధ్య, రిసోర్స్‌పర్సన్ జి.తవిటయ్య పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాల్లో బోర్డులు

నెల్లిమర్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుషిని గ్రామ పరిధిలో ఆక్రమంగా సాగు చేస్తున్న ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ అధికారులు బుధవారం బోర్డులు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు వీఆర్వో గోవిందరావు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

హెల్మెట్ తప్పనిసరి

సంతకవిటి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం పొనుగుటివలస సెంటర్‌లో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్లనే ప్రమాదాల్లో అత్యధిక శాతం మృతి చెందుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలను యువతకు వివరించారు.

ఆదిత్యుని కల్యాణం

శృంగవరపుకోట రూరల్, నవంబరు 20: స్థానిక శ్రీసూర్యదేవాలయంలో బుధవారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. ధర్మకర్త ముక్కు జానకిబాయ్ ఆధ్వర్యంలో జరిగిన కల్యాణంలో గార్లపాటి సత్యసాయి, పట్నాల ప్రసాదరావు, కొచ్చెర్లకోట రాజేష్, మంత్రిప్రగడ ఫణీంద్ర పాల్గొన్నారు.

గంజాయి ఛాయలు లేకుండా చేస్తాం: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

రాజాం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి రవాణా, అమ్మకాలు, వినియోగాన్ని అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. దీని కోసం ప్రత్యేక బృందాన్ని నియమించినట్లు వెల్లడించారు. రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయ వార్షిక తనిఖీ కోసం బుధవారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా సరిహద్దుల్లో నిఘాను పెంచామన్నారు. వాహనాల తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలో గంజాయి వాసన లేకుండా చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలో గంజాయి విక్రయాలు, వినియోగం, రవాణా చేస్తున్న వారి సమాచారం సేకరించి కఠినంగా వ్యవహరిస్తామని ప్రకటించారు. 'సంకల్పం' కార్యక్రమం ద్వారా గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు, విద్యార్థులకు వివరించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. గంజాయి కేసుల్లో సూత్రధారులను అరెస్ట్ చేసి మూలాలను సమూలంగా గుర్తించి చర్యలు తీసుకోవాలని యంత్రాంగాన్ని ఆదేశించినట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాల నియంత్రణలో ప్రజలు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సైబర్ నేరానికి గురైతే 1930కి లేదా సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

రాష్ట్రీయ రహదారులపై ప్రమాదాల నియంత్రణకు చర్యలు ప్రారంభించామన్నారు. ఇందుకోసం ఇప్పటికే జిల్లావ్యాప్తంగా బ్లాక్‌స్పాట్స్ గుర్తించామని ఎస్పీ చెప్పారు. కాషనరీ బోర్డులు, స్టాపర్స్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దత్తత గ్రామాలలో వారంలో ఒకరోజు సంబంధిత కానిస్టేబుల్ పర్యటించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. అంతకుముందు రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయ రికార్డులను, స్టేషన్ ప్రాంగణంలోని పట్టుబడి ఎండకు ఎండి, వానకు తడుస్తున్న వాహనాలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై ఆరా తీశారు. మెయిన్ రోడ్డులో పడగొట్టిన పోలీసు క్వార్టర్స్ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలాన్ని పోలీసు శాఖకు తిరిగి అప్పగించేందుకు వీలుగా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. బధిరుల పాఠశాలను సందర్శించారు. ఎస్పీతో పాటు చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు, స్పెషల్ బ్రాంచి సి.ఐ. లీలారావు, సి.ఐ.లు, కె.ఎ.కుమార్, ఉపేంద్రరావు, ఎస్.ఐ. రవికిరణ్ ఉన్నారు.

గిరిజన కుటుంబాల అభివృద్ధికి కృషి



అధికారులతో చర్చిస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

శృంగవరపుకోట రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఉత్పత్తులను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లి రాష్ట్రంలోని గిరిజన కుటుంబాలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని జీసీసీ భవనాలను బుధవారం ఆయన పరిశీలించారు. వీటిని ఉపయోగంలోకి తీసుకువచ్చే విషయమై సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతిని పట్టించుకోలేదని ఆరోపించారు. వారిని పూర్తిగా అధో పాతాళానికి తొక్కేసిందన్నారు. గిరిజన సంస్థకు చెందిన ఆస్తులు ప్రస్తుతం దెయ్యాల కొంపల్లా ఉన్నాయన్నారు. త్వరలోనే తమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పర్యవేక్షణలో ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామన్నారు. గిరిజన ఉత్పత్తులకు వినూత్న ప్రచారం ద్వారా ప్రపంచంలో వాటి విఖ్యాతి పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దాసరి లక్ష్మి, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ ప్రతినిధులు

చీపురుపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ పట్నం స్టీల్‌ప్లాంటు ప్రవేటీకరణకు వ్యతిరేకంగా డిసెంబరు 1న జరగనున్న మహాధర్నాకు తరలి రావాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి అర్జి శివప్రసాద్, చీపురుపల్లి ఇన్‌చార్జి సబ్బి సత్యన్నారాయణ విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించిన గోడపత్రికను వారు బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బహుజన సమాజ్ పార్టీ ఉద్యమం చేస్తోందన్నారు. 1న విశాఖపట్నంలో జరగనున్న ధర్నాకు పెద్ద ఎత్తున ఉద్యమకారులు, కార్మికులు తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ ప్రతినిధులు బోని వెంకటనరసింహులు, కె. గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి

భోగాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని నెల్లిమర్ల బీఎస్పీ అధ్యక్షులు ఎరుకొండ వెంకటరావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో వచ్చే నెల 1న విశాఖ కూర్మన్నపాలెంలో చేపట్టనున్న ధర్నాకు తరలిరావాలంటూ భోగాపురంలో బుధవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టల్ ఖాతాదారులకు విభిన్న సేవలు



బీమా చెక్కును అందిస్తున్న శ్రీనివాసు

కొత్తవలస, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ శాఖ ద్వారా ఖాతాదారులకు వివిధ రకాల సేవలు అందిస్తున్నట్లు జిల్లా పోస్టల్ సూపరెంటెండెంట్ శ్రీనివాసు తెలిపారు. బుధవారం కొత్తవలసలోని సబ్ పోస్టల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. పోస్టల్ శాఖ నిర్వహిస్తున్న ఎన్‌పీసీఐ-డీబీటీ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా-డెరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) మ్యాపింగ్ ప్రత్యేక క్యాంపులను పరిశీలించారు. గ్రామీణ తపాలా బీమా పథకం పాలసీని కట్టి మృతి చెందిన చప్పగణేష్‌కు సంబంధించిన మొత్తం రూ.12 లక్షలను అతని భార్య మౌనికకు అందజేశారు. బ్యాంకులకు దీటుగా పోస్టల్ శాఖలో పొదుపు చేసుకునేవారికి వడ్డీలను అందిస్తున్నట్టు సూపరెంటెండెంట్ శ్రీనివాసు తెలిపారు.

ఆక్రమణలపై ఆరా

భోగాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అమలాంరాయవలస సమీప చెరువును తహసీల్దార్ ఎం.సురేష్ బుధవారం పరిశీలించారు. చెరువును పూడ్చేస్తున్నారంటూ 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 20న వార్త వెలువడిన సంగతి తెలిసిందే. ఆక్రమణలు జరగకుండా చర్యలు చేపడతామని తహసీల్దార్ తెలిపారు.

స్థల పరిశీలన

నెల్లిమర్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఆర్డీవో కీర్తి బుధవారం నెల్లిమర్లలో పర్యటించారు. నగర పంచాయతీలో మురుగునీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. మదుపాడలో జిరాయితీ భూమి రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదు కావడంపై టీడీపీ నాయకుడు ఎన్.శ్రీనివాసరావు సీఎం కార్యాలయానికి వినతిపత్రం అందజేశారు. ఈమేరకు నివేదిక అందజేయాలని తహసీల్దార్ సుదర్శన్‌రావుకు సూచించారు.

రాజాం విద్యార్థుల ప్రతిభ

రాజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలభవన్ విద్యార్థులు నిహారిక, యామిని, దీక్షిత, చాతుర్యలు ఢిల్లీలో నిర్వహిస్తున్న జాతీయ బాలల సదస్సులో ప్రతిభ కనబరిచారు. బుధవారం మన దేశ గొప్పతనాన్ని వివరిస్తూ నాట్య ప్రదర్శన ఇచ్చారని బాలభవన్ డైరెక్టర్ సుంకరి రమేష్ తెలిపారు. వీరిని వివిధ శాఖల అధికారులు అభినందించారు.

హాజరు తగ్గితే చర్యలు

గుర్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం తగ్గితే ఊరుకునేది లేదని జిల్లా డీఈవో మాణిక్యంనాయుడు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో పాఠశాల సబ్జెక్టు సముదాయ సమావేశాన్ని బుధవారం పరిశీలించారు. విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

పీఆర్సీని తక్షణమే అమలు చేయాలి

చీపురుపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పీఆర్సీని అమలు చేయాలని ప్రభుత్వ పింఛనుదారుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నారాయణరావు డిమాండ్ చేశారు. ఆ సంఘం చీపురుపల్లి శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో పింఛన్ల సర్వసభ్య సమావేశం, కార్తీక వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.జగన్నాథం, విజయనగరం పట్టణ అధ్యక్షుడు వి.సూర్యనారాయణ, చీపురుపల్లి సంఘ ప్రతినిధులు పి.సత్యం, సుబుద్ధి లక్ష్మణరావు, కె.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల విద్యపై భయాన్ని పోగొట్టండి

చీపురుపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల విద్యపై విద్యార్థులకు భయాన్ని పోగొట్టడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ యు.మాణిక్యంనాయుడు సూచించారు. బుధవారం ఆయన చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాషోపాధ్యాయుల శిక్షణ తరగతులను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన వెంట పరీక్షల బోర్డు కార్యదర్శి టి.సన్యాసిరాజు, హెచ్‌ఎం కె. చంద్రశేఖరకుమార్ తదితరులు ఉన్నారు.

10న చలో విజయవాడ

గంట్యాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాత పింఛను విధానం అమలు చేయాలని కోరుతూ డిసెంబరు 10న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి గంట శ్రీనివాసరావు, గంట్యాడ మండల అధ్యక్షులు కె.సతీష్ కోరారు. బుధవారం సాయంత్రం వివిధ పాఠశాలల వద్ద చలో విజయవాడ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

స్నేహపూర్వకంగా మెలగండి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) సహ ఉద్యోగులు, ఇతర శాఖల అధికారులతో స్నేహపూర్వకంగా మెలగాలని ఏపీజీఎల్‌ఐ రాష్ట్ర సంచాలకులు రెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఏపీజీఎల్‌ఐ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుణాలు, క్లెయిముల పరిష్కారంలో చొరవ చూపాలని చెప్పారు. ముందుగా సంచాలకులు రెడ్డి శ్రీనివాస్ స్థానిక పైడితల్లి అమ్మవారి దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు వీఆర్ నాయుడు, ఏడీ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి క్రికెట్ టోర్నీ

విజయనగరం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశవాళీ టీ- 20 క్రికెట్ టోర్నీ సయ్యద్ ముస్తక్‌అలీ ట్రోఫీ పోటీలకు జిల్లా కేంద్రంలోని విజ్జీ స్టేడియం, చింతలవలసలోని పీవీజీ రాజు స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదిక కానున్నాయి. బీసీసీఐ ఆధ్వర్యంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆతిథ్యం ఇవ్వనున్న ఈ టోర్నీ ఈ నెల 23 నుంచి ప్రారంభం కానుందని ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మ్యాచ్‌లు డిసెంబరు 5 వరకు జరుగుతాయని ఆయన తెలిపారు. మ్యాచ్ నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ టోర్నీలో అస్సోం, రైల్వేస్, చండీఘడ్, పాండిచ్చేరి, విదర్భ, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఆ జట్లు బుధవారం విశాఖకు చేరుకున్నాయని వెల్లడించారు. ఇండియా, ఐపీఎల్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆటగాళ్లు ఈ టోర్నీలో పాల్గొంటారని తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విజయనగరం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. నగరంలోని ఓ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ దామోదరరావు, సామాజిక కార్యకర్త అబ్దుల్ రవూఫ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

దైవ దర్శనం నుంచి వస్తుండగా..



పల్లవికి వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

శృంగవరపుకోట రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం ఎన్‌ఆర్ పురం వద్ద ఉన్న వైకుంఠ గిరి ఆలయానికి వెళ్లి వస్తూ గంట్యాడకు చెందిన ఒక కుటుంబం గాయాలపాలైంది. స్థానికుల కథనం మేరకు గంట్యాడ మండలం మురపాకకు చెందిన ఓ కుటుంబ సభ్యులు ముగ్గురు తమ ద్విచక్ర వాహనంపై అక్కడికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో వీరు వస్తున్న బైక్ ప్రమాదానికి గురైంది. వెంటనే స్థానికులు 108 ద్వారా ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. వీరిలో భార్యాభర్తలు వెంకటరమణ, దేవి స్వల్పంగా గాయపడగా, వారి కుమార్తె పల్లవి తీవ్రంగా గాయపడింది. మెరుగైన వైద్యం కోసం ఆమెను విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి తమకు ఎటువంటి సమాచారం అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

విజయనగరం క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొత్తవలస మండలం రామలింగాపురం గ్రామ శివార్లలో అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న సిమ్మా దేవుడమ్మ అనే మహిళను ఆదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్సుమెంటు సీఐ సింహాద్రి తెలిపారు. దేవుడమ్మను తదుపరి చర్యల నిమిత్తం కొత్తవలస ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు అప్పగించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ రాజశ్రీ, హెచ్‌సీ నాగేశ్వరరావు, ఈసీలు ప్రసాద్, నాయుడు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

లక్కవరపుకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మల్లివీడు పంచాయతీ మాజీ సర్పంచ్ బోని పవన్‌కుమార్ బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాంప్రసాద్, కరెడ్ల ఈశ్వరరావు, కొల్లు రమణమూర్తి, శ్రీనాథు, పెదబాబు, మల్లునాయుడు తదితరులు సంతాపం ప్రకటించారు.

కోడిశలో వ్యక్తి అదృశ్యం

రేగిడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోడిశ గ్రామానికి చెందిన పట్నాల అన్నాజీరావు బుధవారం అదృశ్యమయ్యాడు. గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు గ్రామానికి కారులో వచ్చి తన భర్తను తీసుకెళ్లారని, అప్పటి నుంచి అతని ఆచూకీ లేదని భార్య పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ రాజారావు తెలిపారు.

పశువుల లారీ స్వాధీనం

దత్తిరాజేరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చౌదంతివలస జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న పశువుల లారీని పట్టుకున్నట్టు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. ఆయన వివరాల మేరకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా 32 పశువులను కంటైనర్ లారీలో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఆ పశువులను పార్వతీపురం నుంచి చిలకలూరిపేట తరలిస్తున్నట్టు తెలిసిందన్నారు. లారీని స్వాధీనం చేసుకొని డ్రైవర్ అప్పలకొండపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

బొబ్బిలి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రామభద్రపురం మండలం చందాపురం గ్రామ పరిధిలో గెడ్డ అంచున గల తుప్పలలో సుమారు 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సిఐ చిన్నంనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంటసారా తయారీ, అమ్మకం, రవాణా వంటి కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గిరిజన వర్సిటీ నిర్మాణంలో తీవ్ర జాప్యం



యూనివర్సిటీ పనులను పరిశీలిస్తున్న అజయ్ శర్మ

మెంటాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన యూనివర్సిటీ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగిందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజయశర్మ అన్నారు. బుధవారం కుంటినవలసలో గిరిజన యూనివర్సిటీ పనులను ప్రజా సంఘాల నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. కొత్తవలస మండలం రెల్లి వద్ద అప్పుడు సేకరించిన స్థలంలోనే నిర్మిస్తామని అసెంబ్లీలో మంత్రి నారా లోకేష్ ప్రకటించడం ఆందోళనకు గురిచేస్తోందన్నారు. దీనివల్ల నిర్మాణం మరింత ఆలస్యం అవుతుందన్నారు. మెంటాడలోనే యూనివర్సిటీ నిర్మాణం చేపట్టాలని కోరుతూ కేంద్ర విద్యా శాఖ మంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని తెలిపారు. గిరిజనులకు 50 శాతం సీట్లు కేటాయించేలా చట్టబద్ధత చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎంఎస్ వాసు, ఉపాధ్యక్షులు కె.విజయ గౌరి, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి టి.సోములు, సర్పంచ్ రమేష్ నాయుడు, మన్యం జిల్లా కార్యదర్శి సీదరి అప్పారావు, వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు తదితరులు పాల్గొన్నారు.

8న గర్జన సభకు సన్నాహాలు

చీపురుపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ వచ్చే నెల 8న విశాఖపట్నంలోని గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించనున్న మాలల గర్జన సభకు తరలి రావాలని ఉత్తరాంధ్ర మాలల కన్వీనర్ పతివాడ రాంబాబు కోరారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని ఆయన సోమవారం చీపురుపల్లిలో ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో దళిత మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటాన అప్పారావు, నియోజకవర్గ కన్వీనర్ టొంపల సంజీవరావు, ప్రధాన కార్యదర్శి అద్దూరి కృష్ణ, బూర సూర్యనారాయణ, బోడసింగి పోలీస్, దీనుపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

కంచరాం చిన్నారులకు పురస్కారం

రాజాం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ ఐకాన్ ఆఫ్ విజయనగరం అవార్డు వరించింది. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులు పెనుబోతుల సౌజన్య, పిల్లా శిరీష, పైలా సత్యవతిలకు ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేశలి అప్పారావు ఈ బహుమతులను అందజేశారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో జరిగిన సైన్స్‌ఫెయిర్‌లలో గైడ్ టీచర్ పండూరు వేణుగోపాల్ సారథ్యంలో ఈ విద్యార్థినుల ప్రతిభను గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాంగోపాల్

సాలూరు రూరల్/సాలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని ప్రత్యేకాధికారి బి.రాంగోపాల్ ఆదేశించారు. బుధవారం సాలూరు మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో వేర్వేరుగా గ్రామ,వార్డు సచివాలయాల ఉద్యోగులతో సమీక్షించారు. హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ లోకేషన్ సర్వే జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. సర్వే వేగంగా నిర్వహించాలన్నారు. ఎన్పీసీఐ లింకింగ్, స్కూల్ పరిశీలన, సచివాలయ ఉద్యోగుల హాజరు, ఏపీ సేవా సర్వీసుల డబ్బు చెల్లింపు, సామాజిక మరుగుదొడ్లు తదితర అంశాలపై చర్చించారు. సర్వేలో డివైజ్‌ల ఇబ్బందిని సిబ్బంది ప్రత్యేకాధికారి దృష్టికి తెచ్చారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లా కో ఆర్డినేటర్ వి.చిట్టిబాబు, ఎంపీడీవో రమాదేవి, ఏవో పార్వతి పాల్గొన్నారు.

సమయపాలన పాటించాల్సిందే..

మక్కువ, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ప్రత్యేకాధికారి బి.రాంగోపాల్ అన్నారు. స్థానిక వెలుగు మహిళా సమాఖ్య భవనంలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ సిబ్బందికి ఆన్‌లైన్ హాజరు తప్పనిసరి చేశామన్నారు. యూజర్ చార్జీలను ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలన్నారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి

బెలగాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్పీ అంకిత సురానా అన్నారు. బుధవారం స్థానిక ప్రైవేట్ పాఠశాలలో ఐఆర్‌డబ్ల్యూఏ ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిల్డ్రన్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం దిశగా సాగాలని, అనుకున్నది సాధించి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ రాణి, తదితరులు పాల్గొన్నారు. ● గరుగుబిల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సోదర భావంతో మెలగాలని ఏఎస్పీ అంకిత సురానా అన్నారు. ఉల్లిభద్రలోని ఉద్యాన కళాశాలలో యాంటీ ర్యాగింగ్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ర్యాగింగ్ యాక్ట్ 1997పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల డీన్ రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంతోనే లక్ష్యాలు సాధించగలం

పార్వతీపురం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉంటేనే లక్ష్యాలు సాధించగలమని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కె.విజయ పార్వతి తెలిపారు. విద్యార్థుల అభ్యసన, పురోగతి లక్ష్యాలకు అనారోగ్య సమస్యలు అవరోధం కాకూడదని అన్నారు. బుధవారం తాళ్లబురిడి జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయ, వైద్య సిబ్బందితో సమీక్షించారు. విద్యార్థుల ఆరోగ్య పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం, ప్రగతి నివేదికలు, హిమోగ్లోబిన్ రక్తపరీక్షల ఫలితాలు, రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రతివారం విద్యార్థులతో తప్పకుండా ఐరన్ మాత్రలు వేయించాలన్నారు. మార్కుల వారీగా తక్కువ గ్రేడ్ పొందిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో తాగునీటి స్వచ్ఛత పరీక్షలు చేయించారు. విద్యార్థులకు చేతులు పరిశుభ్రత, ఆరోగ్యపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు, డెమో యోగీశ్వరరెడ్డి తదితరులున్నారు.

వివాదాస్పద భూముల పరిశీలన

మక్కువ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మార్కొండపుట్టి పంచాయతీ పెదగైశీల రెవెన్యూ పరిధిలోని వివాదం చోటు చేసుకున్న భూములను బుధవారం తహసీల్దార్ షేక్ ఇబ్రహీం పరిశీలించారు. రైతు భాగవతుల నరసింహులకు చెందిన సుమారు రెండు ఎకరాల భూమికి సంబంధించి ఎఫ్‌లైన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిరాయితీ భూముల్లో పంట నష్టపరిచిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వివాదాస్పద గడ్డ పోరంబోకు భూమిని 145 నోటీసులో ఉంచుతామన్నారు. ఆర్ఐ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాలూరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాలూరు ఆటోనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా నేడు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ కె.గోపాలరావు నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంతో పాటు మండలంలో బాగువలస, చంద్రంపేట, తాడిలోవ, బోరబంద తదితర గ్రామాల్లో గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సర ఫరా ఉండదని పేర్కొన్నారు.

'మా డిమాండ్లు పరిష్కరించాలి'

గరుగుబిల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో భాగమైన తమ డిమాండ్లు పరిష్కరించాలని జిల్లా 104 ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు ఆనందరావు, సీనియర్ నాయకులు దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ .. ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించాలని, 104 వాహనాలను పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలని, 104 సర్వీసులో పనిచేస్తున్న సీనియర్ డ్రైవర్లను ఇతర వైద్యశాఖల్లో కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని కోరారు. డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగులకు భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐలు అరబిందో యాజమాన్యం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

బాలికోన్నత పాఠశాల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీటీజీ బాలికల గురుకుల పాఠశాల, కేజీబీవీని జిల్లా బాలస్వస్థి కార్యక్రమం ఇన్‌చార్జి రఘు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కిశోరీ బాలికల ఆరోగ్య పరిరక్షణ, పారిశుధ్యం, పౌష్టికాహారం, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శానిటేషన్ తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. తాడికొండ పీహెచ్‌సీ వైద్యుడు అభిలాష్, సీహెచ్‌వో పద్మ, మెయిల్ వర్కర్లు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

జియ్యమ్మవలస, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రావాడ రామభద్రపురం బాలుర టీడబ్ల్యూఏహెచ్ స్కూల్ నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎన్.తిరుపతి, డిప్యూటీ వార్డెన్ ఎల్.గణపతిరావు బుధవారం తెలిపారు. జన జాతీయ గౌరవ దివస్‌లో భాగంగా నిర్వహించిన పోటీల్లో 9వ తరగతి విద్యార్థి కిల్లక శ్రీకాంత్ వాలీబాల్‌లో, 7వ తరగతి విద్యార్థి గోరపాడు దిలీప్ డ్రాయింగ్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వారికి డిప్యూటీ డీఈవో మోహనరాయుడు, ఏటీడబ్ల్యూవో కె.శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.

ఎంఈవోపై విచారణ

గరుగుబిల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండల విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహించి సస్పెండైన ఎన్.నాగభూషణరావుపై బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో అధికారులు విచారణ నిర్వహించారు. విచారణ అధికారి జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.దామోధరరావు మాట్లాడుతూ.. గతంలో నాగభూషణరావు జియ్యమ్మవలస మండల ఇన్‌చార్జి ఎంఈవోగా విధులు నిర్వహించి సమయంలో సీఆర్‌పీల నుంచి వసూళ్లకు పాల్పడినట్లు బాసంగి ఉపాధ్యాయులతో పాటు యూటీఎఫ్ ప్రతినిధుల రీజనల్ జాయింట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు ఫిర్యాదుదారుల నుంచి అవసరమైన ఆధారాలు సేకరించామన్నారు. పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి రీజనల్ జాయింట్ డైరెక్టర్‌కు నివేదికలు అందించనున్నట్లు తెలిపారు.

నిరసన హోరు

● కలెక్టరేట్, ఐటీడీఏల వద్ద ప్రజా సంఘాల ఆందోళనలు





కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వైకేపీ వీవోఏలు, సీతంపేట ఐటీడీఏ వద్ద దీక్ష చేపడుతున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

మూడేళ్ల కాలపరిమితి రద్దు చేయాలి..

బెలగాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని వైకేపీ వీవోఏలు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని, రాజకీయ జోక్యం తగ్గించాలని , హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, కనీస వేతనం ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని నినాదాలు చేశారు. వైకేపీ వీవోఏల సంఘం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని..

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పల నాయుడు కలెక్టరేట్ వద్ద నిరసనకార్యక్రమం చేపట్టారు. తోటపల్లి కుడి, ఎడమ ప్రధాన కాలువల ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయాలన్నారు. జంఝావతి ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఇదే సరైన సమయమన్నారు. రావాడ, అంకలం, కాలువల ఆధునీకీకరణ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరారు. గరుగుబిల్లి మండలంలోని ఓ సంస్థ మైనింగ్ వ్యర్థాలతో తోటపల్లి, జంఝావతి కాలువలు మూసుకుపోతున్నాయని తెలిపారు. అనుమతులు లేకుండా బ్రిడ్జిలను ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా భారీ వాహనాలు నడుపుతూ కాలువ గట్లను పాడు చేస్తున్నారని చెప్పారు. అక్రమ మైనింగ్ రద్దు చేయాలని కోరారు.

ఉద్యోగులుగా గుర్తించాలని..

కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని గిరిజన సంక్షేమ, గురుకుల పాఠశాల, కళాశాలలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు బుధవారం ఐటీడీఏ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. తమ పోస్టుల డీఎస్సీ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు అరసాడ రమేష్, రాయల వెంకట్, దివాకర్, రంజిత్ పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ టీచర్ల రిలే దీక్షలు

సీతంపేట రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని గురుకులాల ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు బుధవారం ఐటీడీఏ కార్యాలయం ప్రధాన గేటు వద్ద దీక్ష చేపట్టారు. సీతంపేట ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఈ దీక్షకు మద్దతు తెలిపింది. ఈ దీక్షలో ఏజెన్సీ అధ్యక్షులు బిడ్డిక శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

బెలగాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఓ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. బుధవారం పలు ప్రజా సంఘాల నాయకులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కోల్‌కతా ఘటన మరువక ముందే విశాఖలో మరో ఘటన జరగడం బాధాకరమన్నారు. మహిళలకు రక్షణ కల్పించి, నిందితులకు కఠిన శిక్షలు విధించాలని నినదించారు. ప్రజా సంఘాల నాయకులు కె.సుబ్బరావమ్మ, జ్యోతి లక్ష్మి, ఇందిర, వెంకట రమణ, మన్మధరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో సత్తాచాటాలి



పోటీలను ప్రారంభిస్తున్న పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

పార్వతీపురం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులు క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించి ఐటీడీఏకు పేరు తేవాలని ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ సూచించారు. జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రభుత్వ గిరిజన ఉన్నత ఆశ్రమ పాఠశాలలో క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో సత్తా చాటేలా ప్రోత్సాహం అందిస్తామన్నారు. అనంతరం జరిగిన వాలీబాల్, అర్చరీ, జావెలిన్ త్రో, వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల విజేతలకు డీడీఈవో మెహన్ నాయుడు బహుమతులు ప్రదానం చేశారు. ఈ క్రీడా పోటీల్లో విజేతలైన వారిని ఈనెల 23 నుంచి 26వ తేది వరకు విశాఖలో జరిగే రాష్ట్రస్థాయిల పోటీలకు పంపిస్తామని ఐటీడీఏ క్రీడల కో ఆర్డినేటర్ ఎం.వాసుదేవరావు తెలిపారు. ఏటీడబ్ల్యూవోలు, శ్రీనివాసరావు, చంద్రబాబు, సురేష్ పాల్గొన్నారు.



క్రీడా పోటీల్లో భాగంగా విల్లు ఎక్కుపెట్టిన సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

● సీతంపేట రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మవిశ్వాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జన జాతీయ గౌరవ్‌దివస్‌లో భాగంగా గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా ఆడాలని సూచించారు. ఏపీవో చిన్నబాబు, ఏవో సునీల్, డీడీ అన్నదొర, డిప్యూటీ డీఈవో నారాయుడు, ఏటీడబ్ల్యూవో మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

పార్వతీపురం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వానికి సంబంధించిన జి లే అవుట్‌లో బడి, గుడికి కేటాయించిన స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలని సీపీఎం నాయకులు జీవీ రమణ, పి.సన్యాసిరావు తదితరులు కోరారు. బుధవారం వారు కమిషనర్ జి. శ్రీనివాసరాజుకు వినతి పత్రం అందించారు. సర్వే నంబరు 188-1,3 కొత్తవలస గ్రామ సమీపంలోని జగనన్న కాలనీలో ఆక్రమణదారుల చేతులో ఉన్న ప్రభుత్వ భూమిని అర్హులైన వారికి పంపిణీ చేయాలని విన్నవించారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాల సీఐటీయూ నాయకుడు జీవీ రమణ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్. శంకరరావు కమిషనర్‌కు వినతపత్రం అందించారు. గత ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్న వారికి పనిభారం తగ్గించాలని, 2024 జనవరి నెలకు గాను 11 మందికి జీతం ఇవ్వాలని, సమ్మె కాలానికి సంబంధించి వేతనాలు ఇవ్వాలని కోరారు. పార్వతీపురంలోని 30 వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని జనసేన పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజును కోరారు. తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు చందక అనిల్, తదితరులు ఉన్నారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి

జియ్యమ్మవలస, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కూరంగి సీతారాం, కొల్లి గంగు నాయుడులు డిమాండ్ చేశారు. బుధవారం డంగభద్రలో ధాన్యాన్ని పరిశీలించారు. మద్దతు ధరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోకుంటే రైతులతో పెద్ద ఎత్తున కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మన బడి - మన తోట అమలు తీరు భేష్

● ఇన్‌చార్జి డీఈవో తిరుపతినాయుడు

గరుగుబిల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మన బడి - మన తోట అమలుతీరు బాగుందని ఇన్‌చార్జి డీఈవో తిరుపతినాయుడు అన్నారు. బుధవారం తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు. అందుకే మన బడి - మన తోట కార్యక్రమాన్ని పాఠశాలల్లో అమలు చేస్తున్నామని తెలిపారు. బడి తోటలు సాగు చేస్తున్న ఉత్తమ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యాస రచన, వకృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మెమోంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. గ్రంథాలయ సంస్థ ఉపాధ్యక్షుడు డి.పారి నాయుడు పాల్గొన్నారు.

ఇనాం భూములపై దర్యాప్తు చేయాలని డిమాండ్

పాలకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జంపరకోట పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్ 54లో ఉన్న ఇనాం భూములను తప్పుడు పత్రాలతో స్వాధీనం చేసుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు బత్తినమోహన్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. రైతులు చింతాడ చంద్రయ్య, రాంబాబు, తిరుపతిరావు, జంపరకోట సర్పంచ్ నారాయణరావు, ప్రసాదరావు, జనార్ధనరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పాలకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిన్నమంగళాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావువివరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో తిరుపతినాయుడు, హెచ్‌ఎంలు జె.రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి సర్వేపై శిక్షణ

బొబ్బిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పురపాలక సంఘం కౌన్సిల్ హాల్‌లో బుధవారం కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆధ్వర్యంలో సచివాలయాల కార్యదర్శులకు సమగ్ర నైపుణ్యాభివృద్ధి సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రాజెక్ట్ అధికారి ఎమ్.జగన్మోహనరావు, మేనేజర్ రాఘవాచార్యులు, మండల ఇంచార్జి కె.భవాని, మాస్టర్ ట్రైనర్ అశోక్, శంకరరావు పాల్గొన్నారు. ● బొబ్బిలి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పి.రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం నైపుణ్య సర్వేపై శిక్షణ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భాస్కరరావు, ఏఓ అప్పారావు, ఉపాధి అధికారిణి భవాని, ఎంసీఓవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

గరుగుబిల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి బి.రాజ్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణలను పరిశీలించారు. లెక్కలు, సైన్స్, ఇంగ్లీషు సబ్జెక్టులపై అవగాహన కల్పించాలని టీచర్లకు సూచించారు.

అపార్ నమోదు వేగవంతం

గరుగుబిల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో అపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని గరుగుబిల్లి ఎంఈవో దత్తి అప్పలనాయుడు సూచించారు. బుధవారం కొత్తూరులో పాఠశాలల సముదాయ సమావేశం నిర్వహించారు. నూతన ఆలోచనలతో ప్రణాళికలను రూపొందించుకుని, టెన్త్ పాఠ్యాంశాలను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని టీచర్లకు సూచించారు.

కన్నుల పండువగా సహస్ర దీపార్చన

పాలకొండ: పట్టణంలోని లలితా త్రిపుర మహాసుందరి ఆలయంలో బుధవారం రాత్రి సహస్ర దీపార్చన నిర్వహించారు. మహిళలు ఆలయ సన్నిధిలో లింగాకారంలో దీపాలు వెలిగించారు. అంతకుముందు లలితాదేవికి గాజులు, పసుపు, కుంకుమతో పూజలు చేశారు.



న్యూస్ బాక్స్

29న గ్రాండ్ టెస్ట్

బలిజిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 29న టెన్త్ విద్యార్థులకు ప్రత్యేకంగా గ్రాండ్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్టు బలిజిపేట ఎంఈవో-1 సామల సింహాచలం తెలిపారు. బుధవారం ఆయన వంతరాం కేజీబీవీని ఆకస్మికంగా సందర్శించారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు ఇప్పటినుంచే కష్టపడి చదవాలని విద్యార్థినులకు సూచించారు.

వంతరాం ఆధార్ సెంటర్ పరిశీలన

వంతారం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంఈవో-1 సామల సింహాచలం పరిశీలించారు. విద్యార్థులు ఎంతవరకు అపార్ ఐడీలను నమోదు చేసుకున్నది డిజిటల్ అసిస్టెంట్ ఉషారాణిని అడిగి తెలుసుకున్నారు.

సమస్యలు పరిష్కరించండి

పాలకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సమస్యలు పరిష్కరించాలని టీడీపీ పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పల్లా కొండలరావు కోరారు. బుధవారం ఆయన తహసీల్దార్ బాలమురళీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. డంపింగ్‌యార్డు సమస్యకు పరిష్కార మార్గం చూపాలని కోరారు.

పైపులైన్‌కు మరమ్మతులు

పార్వతీపురం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధులతో తాగునీటి పైపులైన్లు మరమ్మతులు చేస్తున్నట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం జిల్లా అధికారి ఓ. ప్రభాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జియ్యమ్మవలస మండలం చిన్నతుంబలిలో గ్రామంలో తాగునీటి ఎద్దడి లేదన్నారు.

హాస్టళ్ల నిర్వహణకు ప్రతిపాదనలు

పార్వతీపురం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ బీసీ వసతిగృహాల నిర్వహణ, మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించామని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ నుంచి అక్టోబరు నెలకు సంబంధించి కాస్మెటిక్ చార్జీలను ఆన్‌లైన్‌లో చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న 12 బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు, మరమ్మతులకు రూ.2 కోట్ల 40 లక్షలు అవసరమన్నారు. నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

రేపు గ్రామసభలు

వీరఘట్టం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డులు పునఃపరిశీలనకు ఈ నెల 22న గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీవో బి.వెంకటరమణ ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లతో మాట్లాడుతూ.. పల్లె పండగ పనులను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. పీఎం సూర్యఘర్‌కు సంబంధించి లబ్ధిదారుల వివరాలు నమోదు చేయాలని డిజిటల్ అసిస్టెంట్లకు సూచించారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు..

మక్కువ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని లేబర్ ఆఫీసర్ ఎ.సుందరరావు అన్నారు. బుధవారం మక్కువలో చైల్డ్‌లేబర్ డిపార్ట్‌మెంట్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలను పనిలో చేర్చుకోవడం చట్టరీత్యానేరమన్నారు. పార్వతీపురం మహిళా పోలీస్‌స్టేషన్ పీహెచ్‌సీ లావణ్య, సీఎస్‌డబ్ల్యూవో అచ్యుతరావు పాల్గొన్నారు.